క్లుప్తంగా

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని ఆలయ ఈఓకు అందజేస్తున్న దాత చిట్టిబాబు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి రైల్వేకోడూరుకు చెందిన చిన్నరెడ్డెయ్య, శ్రీహరిలు రూ.25,116, చిత్తూరుజిల్లా పెనుమూరు కు చెందిన చిట్టిబాబు రూ.20116 విరాళంగా అందజేశారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన దాతలకు ఆలయ ఈఓ మంజుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరిగ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు ఈఓ తెలిపారు.

రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాను మృతికి నివాళి

బి.కొత్తకోట : స్థానిక పోకనాటివీధికి చెందిన రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాను కంచి రాజారెడ్డి (54) సోమవారం రాత్రి మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను బెంగళూరులో వైద్య చికిత్సలు చేయించినా ప్రయోజనం లేకపోయింది. రాజారెడ్డి మృతదేహానికి కలికిరి బీఎస్ఎఫ్ బెటాలియన్ నుంచి వచ్చిన ఎస్ఐ తిమ్మారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రాకేష్, కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి, రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్లు బీఎస్ఎఫ్ సంప్రదాయ పద్ధతిలో నివాళులర్పించారు. కుటుంబాన్ని ఆదుకునేందుకు కృషి చేస్తామని చెప్పారు.

మరుగుదొడ్లను నిర్మించాలని వినతి

బి.కొత్తకోట : బి.కొత్తకోట దిగువబస్టాండ్‌లో మరుగుదొడ్లను నిర్మించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోరంట్ల రమేష్, జిల్లా కార్యదర్శి ఎస్.శోభారాణి కోరారు. మంగళవారం కమీషనర్ పీఆర్.మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. స్వచ్ఛభారత్ పథకం కింద వీటిని నిర్మించాలని సూచించగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు భానుప్రకాష్, ముకుంద, షౌకత్‌అలీ, కార్తీక్, గోపి, బాలాజీ పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లె : జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ బాలినాయునిపల్లె సమీపంలో జూదమాడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. దాడిలో ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.5,090 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచామన్నారు.

ఏక్ భారత్ శ్రేష్టలో మిట్స్ విద్యార్థులు



ఏక్ భారత్ శ్రేష్టలో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్స్‌తో ప్రిన్సిపల్

కురబలకోట : పంజాబ్‌లోని రూప్నగర్‌లో జరిగిన ఏక్ భారత్ శ్రేష్ఠ క్యాంపులో అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ కె. మహేష్, ఆనందరెడ్డి, రేణుశ్రీ, షణ్ముఖరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, సిద్దిరామిరెడ్డి పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ మంగళవారం తెలిపారు. దేశం నలుమూలల నుంచి పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆంధ్ర బెటాలియన్ చిత్తూరు నుంచి వీరు పంజాబ్ క్యాంపుకు హాజరైనట్లు తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం భావజాలాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఒకే దేశం అనే భావన పెంపొందుతుందన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

తంబళ్లపల్లె : కన్నెమడుగు పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన వసంతరెడ్డి (47) స్థానిక ఇండియన్‌బ్యాంకు బ్రాంచ్ బ్యాంకు కరస్పాండెంట్‌గా, వైఎస్సార్ క్రాంతిపథం సంఘమిత్రగా పనిచేస్తూ వారం రోజుల క్రితం మృతి చెందాడు. ఇండియన్ బ్యాంకు కరస్పాండెంట్లు, సహచర కరస్పాండెంట్ వసంతరెడ్డి భార్య యశోదమ్మకు మంగళవారం రూ.23,001లు అందజేసి, పరామర్శించారు.

26న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 26న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-1, 2 డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్సీ నిరంజన్ తెలిపారు. 26 ఉదయం బయలుదేరుతాయన్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలక్స్ బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9959225677, 91601866454ను సంప్రదించాలన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- చీకలబైలులో వై ఏపీ నీడ్స్ జగన్



వై ఏపీ నీడ్స్ జగన్ బ్రోచర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పేద ప్రజలకు మేలు జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అధికారం ఇచ్చి ఆశీర్వదించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని చీకలబైలు సచివాలయం వద్ద మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు చీకలబైలు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. తొలుత వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో చీకలబైలు సచివాలయ పరిధిలో వివిధ పథకాల రూపంలో గ్రామ ప్రజలకు కలిగిన లబ్ధిని తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99శాతం పైగా నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధిని వివరించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పేదల జీవనప్రమాణాలు మెరుగుపరచడమే ధ్యేయంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో ఎంత లబ్ధి చేకూరిందో... వైఎస్సార్ సీపీ పాలనలో ఎంత లబ్ధి చేకూరిందో ప్రజలు గమనించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పైసా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చుచేశారని తెలిపారు. అనంతరం సచివాలయం నుంచి స్థానిక ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ర్యాలీగా బయలుదేరి చెక్‌పోస్ట్ వద్ద మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మమత, లక్ష్మీదేవమ్మ, సుధాకర్, మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ శరత్‌రెడ్డి, గణేష్, సింగిల్‌విండో డైరెక్టర్ చలపతి, చీకలబైలు బాబురెడ్డి, తరిగొండశివన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం అజెండా

ప్రజాసంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని పోతబోలు పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు సర్పంచ్ ఈశ్వరయ్య, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతి గడపకు వెళ్లి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని అమలుచేసి ప్రతి గడపలో సంతోషాన్ని నింపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి చంద్రబాబు అండ్ కో ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. అబద్ధాలు, మభ్యపెట్టే మాటలు చెప్పడం వారి నైజమన్నారు. ప్రజలకు మంచి చేయాలన్న తాపత్రయం టీడీపీకి లేదన్నారు సంక్షేమ పథకాల మంజూరులో పూర్తి పారదర్శకత పాటిస్తూ, అర్హులందరికీ అందేలా సీఎం చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకులు రత్నమయ్య, కృష్ణప్ప, లక్ష్మీపతి, కరీముల్లా, రమణనాయుడు, మస్తాన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించండి



చెంబకూరులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

రామసముద్రం : ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రభుతాన్ని మరోమారు ఆదరించాలని జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని చెంబకూరు పంచాయతీలో ఏపీకీ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి , వైస్‌ఎంపీపీలు రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, కన్వీనర్ నంద, సర్పంచ్ రమణమ్మ, నాయకులు హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకతీతంగా ప్రజలందరికి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించడం మనసున్న ముఖ్యమంత్రి జగనన్నకే సాధ్యమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అన్నారు. జరగబోయే ఎన్నికల్లో ప్రజా ఆశీస్సులు అందించాలని కోరారు. ప్రతి గ్రామానికి రోడ్లు, సచివాలయం, ఆర్‌బికె కార్యాలయాలు , సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరాలా అమలు చేస్తున్న భారతదేశంలోనే ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అన్నారు. పంచాయతీకి రూ.28 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అనంతరం బస్టాండ్ వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుధాకర్, ఆర్‌బికె చైర్మన్ కృష్ణమూర్తి, కోఆప్షన్ సభ్యులు షంషీర్, ఎల్‌ఐసీ శ్రీనివాసులు, జింకల శ్రీనివాసులు, రాజన్న, ఆదినారాయణ, చంద్ర, కిట్టు, విజయ్‌రాజు, విజయారెడ్డి, రాధా, అంజి, శ్రీనివాసులు, బషీర్, వలంటీర్లు , గృహసారథులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరగాలంటే మళ్లీ సీఎంగా జగన్ కావాలి

తంబళ్లపల్లె: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మేలుజరగాలన్న, రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది భావి తరాల భవిష్యత్తు కోసం మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం కోసువారిపల్లె గ్రామ సచివాలయంలో సర్పంచు విజయలక్ష్మీ, వైస్ ఎంపీపీ శ్యామలమ్మల ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద పార్టీ పతాకాన్ని, సంక్షేమం, అభివృద్ధి సమాచార డిజిటల్ బోర్డు, బుక్‌లెట్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆఫీసు ఏవో ఆనంద్‌కుమార్, ఏపీఓ అంజనప్ప, నాయకులు కిషోర్‌రెడ్డి, రఘునాథ్, శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

కలకడ : జగనన్నతోనే అన్ని రంగాలలో అభివృద్ధి–ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని నడిమిచెర్ల పంచాయతీలో ఆపంచాయతీ సర్పంచ్ నల్లమ్మ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మధ్యవర్తులు, కమిటీలతో సంబంధం లేకుండా అర్హత కలిగిన వారికి అన్ని సంక్షేమ పథకాలను జగనన్న ప్రభుత్వం అందిస్తోందన్నారు. నడిమిచెర్ల పంచాయతీకి పొందిన లబ్ధి, అభివృద్ధి పనుల పట్టికను , వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, కోన, నడిమిచెర్ల సర్పంచ్‌లు జల్లా.రాజగోపాల్‌రెడ్డి, నల్లమ్మ, ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ మోహన్‌రాజ, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధితోపాటు భూగర్భజలాలు పెంపొందించడం లక్ష్యం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ మద్దిలేటి

కేవీపల్లె : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీలకు ఉపాధి కల్పించడం తోపాటు భూగర్భ జలాలు పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పీడీ మద్దిలేటి అన్నారు. మంగళవారం మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ దిన్నెహరిజనవాడ వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలకు అందిస్తున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవీపల్లె మండలం కరువు మండలంగా ప్రకటించడంతో వంద రోజుల పనిని 150 రోజులకు పెంచినట్లు తెలిపారు. ఒక రోజు ఉపాధి కూలీ రూ.275 గిట్టుబాటు అవుతున్నట్లు చెప్పారు. కూలీలకు ఉపయోగపడే విధంగా నీటినిల్వ కందకాలు, మట్టి రోడ్డు పనులు, కాలువల తవ్వకాల పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో నాగరాజ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 150 పనిదినాలు

పీలేరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీలకు 150 పని దినాలు కల్పించాలని పీడీ మద్దిలేటి అన్నారు. మంగళవారం మండలంలోని కావలిపల్లె, ముడుపులవేముల, బోడుమల్లువారిపల్లె పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినందు వల్ల 150 రోజులు ఉపాధి కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలకు వలసలు వెళ్లకుండా స్థానికంగా అవసరమైన పనులు కల్పించాలని తెలిపారు. ఉద్యానపంటలు సాగు చేసుకోవడానికి రైతులను, కూలీలను ప్రోత్సహించాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు రెడ్డిరమ్య ఎంపిక



రెడ్డిరమ్యను అభినందిస్తున్న హెడ్మాస్టర్, పీడీ

గుర్రంకొండ : జాతీయస్థాయి ఫెన్సింగ్ (కత్తిసాము) పోటిలకు గుర్రంకొండకు చెందిన విద్యార్థిని రెడ్డిరమ్య ఎంపికైనట్లు పీడీ చింతిర్ల రమేష్ తెలిపారు. ఇటీవల నంద్యాలలో అండర్–17 రాష్ట్రస్థాయి బాలబాలికల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రెడ్డిరమ్య పాల్గొని ఫెన్సింగ్‌లోని సేబర్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలోనిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. మంచి ప్రతిభ కనబరిచిన రెడ్డిరమ్యను జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్రజట్టుకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చేనెల మహారాష్ట్రలోని లాతూర్‌లో జరగబోయే అండర్ -17 జాతీయఫెన్సింగ్ పోటీల్లో రెడ్డిరమ్య రాష్ట్రం తరపున పాల్గొంటుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, ఉపాధ్యాయులు త్రినాథ్‌రావ్,రెడ్డిమోహన్, ఉషారాణి, అరుణకుమారి, ఖేలో ఇండియా కోచ్ రవీంద్రలు విద్యార్థిని రెడ్డిరమ్యను అభినందించారు.

సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన



వాల్మీకిపురం : మాట్లాడుతున్న నీళ్లభాస్కర్

వాల్మీకిపురం : రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేసి పార్టీ విజయానికి పాటు పడాలని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలను, పొందిన ప్రయోజనాలను ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులను కలుసుకొని వివరించాలన్నారు. ఎలాంటి వివక్షత చూపకుండా అన్ని వర్గాలకూ ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందన్నారు. అర్హత మాత్రమే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందన్నారు. ఎలాంటి రాజకీయ ప్రమేయాలకూ కూడా తావు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ శ్వేత, వైస్ ఎంపిపి వెంకట్రమణ, ఈవోఆర్‌డీ పాండు, ఈవో రజిత, నాయకులు శ్రీరామిరెడ్డి, రవీంద్రారెడ్డి, రాయుడు, సురేష్ రెడ్డి, ఆనంద, నాగరాజ, వెంకటస్వామి, మోహన్ రెడ్డి, సత్య, తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్లు దామోదర్

మదనపల్లె సిటీ : విద్యార్థుల్లో కనీస అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా రిసోర్సుపర్సన్లు దామోదర్, కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం మదనపల్లె,రామసముద్రం మండలాలకు చెందిన ఇంగ్లీషు ఉపాధ్యాయులకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. వారు మాట్లాడుతూ ఇంగ్లీష్ భాషలో వారి సామర్థ్యాలను మదింపు చేసి తదనుగుణంగా విద్యను అందించేలా ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలన్నారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి గుణాత్మక విద్యను అందించుటకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించాలని శిక్షణార్థులను కోరారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె సిటీ : తెనాలిలో జరిగిన తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో మదనపల్లెకు చెందిన విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో మహమ్మద్ అరీఫ్ , గణతేజ, చైతేష్, హర్షలకు బ్రాంజ్ మెడల్స్ దక్కినట్లు గురు రాఘవేంద్ర తైక్వాండోవిష్ణేష్ తెలిపారు. సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో సి.మణ్యప్రియ, బి.కావ్య, మల్లేశ్వరిలకు బ్రాంజ్ మెడల్స్ దక్కినట్లు తెలిపారు.

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సభలో మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

బి.కొత్తకోట : ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని నగర పంచాయతీ కమిషనర్ పీఆర్.మనోహర్ అన్నారు. మంగళవారం స్థానిక పోకనాటివీధిలో రెండవ సచివాలయం పరిధికి సంబంధించి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం పరిధిలో 2019 జూలై నుంచి 2023 అగష్టు వరకు వివిధ పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందిన వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మనోహర్ మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలను అందించడంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ కన్వీనర్లు, మహిళలు పాల్గొన్నారు.

కులగణన పకడ్బందీగా నిర్వహించాలి



కురబలకోట : మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ భానుప్రసాద్



బి.కొత్తకోట: మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

కురబలకోట : ఇంటింటికి వెళ్లి కుల గణన పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్, మదనపల్లె ఎంపీడీఓ భాను ప్రసాద్ కోరారు. మంగళవారం మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి మొబైల్ అప్లికేషన్ యాప్‌లో కులాల వారిగా వివరాలు నమోదు చేయాలన్నారు. సమాజంలో వివిధ కులాల వారి స్థితిగతులు తెలిసి రాగలవన్నారు. ఇందులో వ్యక్తిగత, కుటుంబ, కుల సమాచార వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. వివరాల సేకరణ నుండి నమోదు వరకు జాగ్రత్త వహించాలన్నారు. ఎంపీపీ బి. దస్తగిరి మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా 1931లో కుల గణన జరిగిందన్నారు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ జరగడం ఇదేనన్నారు. 1951లో జనాభా లెక్కలు మాత్రమే సేకరించారన్నారు. రాష్ట్రంలో కుల గణన ఓ చరిత్ర అన్నారు. తహశీల్దారు ఎం.బీమేశ్వరరావు మాట్లాడుతూ ఇది సామాజిక, ఆర్థిక, రాజకీయాలపై ప్రభావం చూపుతుందన్నారు. ఎంపీడీఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ కులాల వాస్తవ స్థితి ఆధారంగా భవిష్యత్తులో వనరుల కేటాయింపు, బడ్జెట్, సంక్షేమ పథకాల అమలుకు ప్రాతిపదికగా మారగలదన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఏఎస్ఓ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుల గణనలో ప్రతి కుటుంబం నమోదు కావాలి

కలకడ : మండలంలో నివాసం ఉన్న ప్రతి కుటుంబం కులగణనలో నమోదు కావాలని, వలస కార్మికులు తప్ప గ్రామ నివాసి అయితే నమోదు తప్పనిసరి అని ఎం.ఓ.టి.గురుప్రకాష్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించి కులగణనపై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని సచివాలయాలలో వలంటీర్, సిబ్బంది టీం ద్వార ప్రతి ఇంటిని సందర్శించి కుల గణన తప్పులకు అవకాశం లేకుండా చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కులగణనలో ఎలాంటి సందేహాలు కలిగిన వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రదీప్, వీఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణన పకడ్బందీగా నిర్వహించండి

పెద్దతిప్పసముద్రం : ఈ నెల 27 నుంచి డిసెంబర్ 4వరకు జరిగే కుల గణన సర్వేను సచివాలయ సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌డీవో లక్ష్మీపతి దేశించారు. మంగళవారం ఆయనతో పాటు తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డిల అధ్యక్షతన స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు కుల గణన సర్వేపై అవగాహన కల్పించారు.

కుల గణన వివరాలు రహస్యం

బి.కొత్తకోట : కులగణన వివరాలు రహస్యంగా ఉంటాయని మదనపల్లె డీఎల్‌డీవో లక్ష్మీపతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై మండల అధికారులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. లక్ష్మీపతి మాట్లాడుతూ ఉద్యోగులు సేకరించే కులగణన వివరాలు ఎవరికి అందుబాటులో ఉండవని, యాప్‌లో నమోదు చేయగానే కనిపించవని అన్నారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. తహసీల్దార్ ఎస్.రఫీక్ అహ్మద్ మాట్లాడుతూ కుల గణనకు ప్రభుత్వ పథకాలకు ఎలాంటి సమబంధం లేదని స్పష్టం చేశారు.

నేటి నుంచి ఆలయ జీర్ణోద్ధరణ పనులు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రమణ, కమిటీ మాజీ చైర్మన్ బింగి పాండు తెలిపారు. 22న సాయంత్రం కలశస్థాపన, అంకుర్పారణ హోమం, వాస్తు హోమం, 23న ఉదయం గణపతి హోమం, ద్వారతోరణం పూజ, 24న ప్రాణ ప్రతిష్టాపన హోమం, రాజగోపురం, ఉత్తరద్వార గోపురం, విమాన గోపురాలకు, వేణుగోపాలస్వామి వారి విమాన గోపులరాలకు మహా కుంభాభిషేకం, సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'మీ భవిష్యత్తుకు మా సహకారం'



కె. విజయకుమారి, మేనేజర్

పీలేరు రూరల్ : డీసీసీ బ్యాంకు అందిస్తున్న 'మీ భవిష్యత్తుకు మా సహకారం' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీలేరు బ్రాంచ్ మేనేజర్ కె. విజయకుమారి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 'మీ భవిష్యత్తుకు మా సహకారం' పథకం ద్వారా ఈ ఏడాది అక్టోబర్ 30 నుంచి 2024 జనవరి 30వ తేదీ వరకు ఖాతాదారులు జీరో బ్యాలెన్స్‌తో ఖాతా ప్రారంభించవచ్చునని తెలిపారు. దీంతో రూపే కార్డు, రూ. లక్ష వరకు జీవిత బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. జగనన్న విద్యా దీవెన, జగనన్న పాలవెల్లువ కార్యక్రం కింద విద్యార్థులు, పాడి రైతులకు జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలు ప్రారంభించుకోవచ్చునని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఆడుదాం ఆంధ్రా' నిర్వహణపై సమీక్ష

నిమ్మనపల్లె : 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలపై ఎంపీడీఓ శేషగిరిరావు మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ పాఠశాల, పీఈటీలు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాపోటీలకు మండలంలోని ఐదు మైదానాలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాలు నిండినవారు సంబంధిత వలంటీర్ల యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడాంశాలలో సచివాలయ పరిధిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో 210 మంది క్రీడాకారులు పాల్గొనే సచివాలయ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా పోటీలకు నిమ్మనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ భద్రయ్య స్పోర్ట్సు కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కఠినచర్యలు

మదనపల్లె : మైనర్ బాల, బాలికలను పనికి పంపినా, పని చేయించుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ కేశప్ప హెచ్చరించారు. ఆపరేషన్ స్వేచ్ఛ స్పేస్–4లో భాగంగా పట్టణంలోని వివిధ షాపుల్లో పనిచేస్తున్న 14 మంది మైనర్ బాలురను ప్రత్యేక టీం ఆధ్వర్యంలో తీసుకువచ్చారు. డీఎస్పీ కార్యాలయంకు వారి తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలే తప్ప పనిలో ఉండరాదన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో తరచూ తనిఖీలు నిర్వహిస్తామని, మైనర్ బాలురను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు కేసులు నమోదుచేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ రమాదేవి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మదనపల్లె : మండలంలోని చీకలబైలు పంచాయతీ జోలపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బోరెడ్డిగారి నాగార్జునరెడ్డి మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా జోలపేటకు వెళ్లి బోరెడ్డి నాగార్జునరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.